సాక్షి కర్నూలు

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.



కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబ అమ్మవారికి 26న నిర్వహించే కుంభోత్సవం సందర్భంగా ఆనవాయితీగా మంగళవారం ఆలయ అధికారులు, సిబ్బంది కొబ్బరికాయలు సమర్పించారు.



ఫలరాజం.. 'ధర' హాసం

ఫలాల్లో రారాజు వంటి మామిడికి మార్కెట్‌లో రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. హైదరాబాద్ మార్కెట్‌లో టన్నుకు రూ.90 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ధర లభిస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

ఆర్‌ఏడీ కింద 15 మల్టీక్రాప్ థ్రెసర్స్

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాధార ప్రాంత అభివృద్ధి (ఆర్‌ఏడీ) పథకం కింద సబ్సిడీతో 26 వేరుశనగ, మల్టీక్రాప్ థ్రెసర్స్‌లు పంపిణీ చేస్తున్నారు. జిల్లాకు ఏడాది కిత్రమే ఆర్‌ఏడీ కింద 26 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందుకు రూ.52 లక్షల సబ్సిడీ మంజూరైంది. ఎన్నికల కోడ్‌కు ముందే 15 యూనిట్లు గ్రౌండింగ్ చేశారు. వీటికి సబ్సిడీ కింద రూ.30 లక్షలు విడుదల చేశారు. సి.బెళగల్, ఆస్పరి మండలాలకు 3 ప్రకారం, వెల్దుర్తి మండలానికి 5, తుగ్గలి, కృష్ణగిరి, కోసిగి, నందవరం మండలాలకు ఒక్కొక్కటి చొప్పున పంపిణీ చేశారు. మిగిలిన 11 యూనిట్లు ఎన్నికల కోడ్ తర్వాత పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు.

జంబులాపరమేశ్వరికి వెండి హారం బహూకరణ



నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని జంబులాపరమేశ్వరి అమ్మవారికి ఓ దాత వెండి హారాన్ని బహూకరించారు. పట్టణానికి చెందిన తాలికోట సుశీలమ్మ వారి కుమారుడు జంబులయ్య మంగళవారం రూ. 1.75 లక్షల విలువైన 2.25 కేజీల వెండి హారాన్ని ఆలయ నిర్వాహకులు గాండ్ల రాజేశ్వరి, జగన్‌కు అందజేశారు. కార్యక్రమంలో బాలాజీ, నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

23న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

నంద్యాలటౌన్: నంద్యాల నుంచి అరుణాచల క్షేత్రానికి ఈ నెల 23వ తేదీన ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామని నంద్యాల ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు తెలిపారు. మంగళ వారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి ప్రయాణికుల సౌకర్యార్థం అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామన్నారు. ఈ సర్వీసు మంగళవారం ఉదయం 7.30 గంటలకు నంద్యాల నుంచి బయలుదేరి కాణిపాకం మీదుగా రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు బుధవారం సాయంత్రం అరుణాచలం నుంచి బస్సు బయలుదేరి వేలూరు మీదుగా నంద్యాల చేరుకుంటుందన్నారు. కాణిపాకం, వేలూరు స్వర్ణదేవాలయాల్లో ప్రయాణికులు భక్తులు దర్శనం చేసుకో వడానికి వీలుగా బస్సును ఆయా క్షేత్రాల్లో నిలుపుతామన్నారు. ఈ సర్వీసుకు చెందిన టికెట్లను బస్టాండ్ లోని రిజర్వేషన్ కౌంటర్, apsrtconline.inలో బుక్ చేసుకోవచ్చని సూచించారు.

రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం




పెళ్లికుమారునిగా ముస్తాబైన స్వామి

జూపాడుబంగ్లా: తర్తూరులో వెలసిన శ్రీ లక్ష్మీరంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు జరిగే ఉత్సవాలను కనులపండువగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పూలచపురం కార్యక్రమంలో భాగంగా స్వామి వారిని పెళ్లికుమారునిగా అర్చకులు ముస్తాబు చేశారు. శ్రీలక్ష్మీదేవి అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్ల మూల, ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. సంప్రదాయంలో భాగంగా జూపాడుబంగ్లా తహసీల్దారు బాబూ రాజేంద్రప్రసాద్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి వారు తర్తూరులో పెళ్లికుమారునిగా ముస్తాబు అయిన అనంతరం ఇక్కడ పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తర్తూరులో స్వామివారికి కల్యాణం నిర్వహించకపోవడం ప్రత్యేకం. బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీరంగనాథస్వామివారు తర్తూరు నుంచి నెల్లూరు జిల్లాల్లోని శ్రీరంగాపురంలో జరిగే కల్యాణ వేడుకలకు తరలివెళ్తారని అర్చకులు తెలిపారు. అక్కడ శ్రీమహాలక్ష్మి అమ్మవారితో రంగనాథస్వామి వారికి కల్యాణ వేడుకలను అంగరంగ వైభోవంగా నిర్వహిస్తారు. స్వామివారు పెళ్లికుమారునిగా ముస్తాబు అయిన సందర్భంగా గ్రామంలోని ప్రజలకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు సింహ వాహనసేవ: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన బుధవారం స్వామివారికి సింహవాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎడి.వెంకటరమణ తెలిపారు. 23న రథోత్సవం, 24న అశ్వవాహనసేవ (పారువేట) నిర్వహిస్తారు.

సార్వత్రిక ఎన్నికల సమరంలో మరో కీలక ఘట్టానికి తెరలేవనుంది. నామినేషన్ల దాఖలుకు ఎన్నికల కమిషన్ రేపు నోటిఫికేషన్ జారీ చేయనుంది. దీంతో అదే రోజు నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. తొలిరోజు దశమి, ఆ తర్వాత ఏకాదశి రెండూ మంచి రోజులు కావడంతో తొలిరెండు రోజుల్లో అధికశాతం మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. ఈ నెల 25 వరకూ నామినేషన్ల దాఖలుకు గడువు ఉండటంతో ముహూర్తబలం రోజు ఒక సెట్, భారీ ర్యాలీగా వెళ్లి మరో సెట్ నామినేషన్లు దాఖలు చేసేందుకు కూడా అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నామినేషన్ల పర్వం ముగిసిన తర్వాత ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకునే అవకాశం ఉంది. దీంతో అన్ని రాజకీయపార్టీలు ఎన్నికల తతంగంలో తలమునకలయ్యాయి.



నామినేషన్లకు వేళాయె!

రేపు నోటిఫికేషన్ విడుదల చేయనున్న ఎన్నికల కమిషన్

- అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ
- దశమి, ఏకాదశి ఉండటంతో తొలి రెండురోజుల్లో భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం
- ఇప్పటికే ఆర్‌ఓలకు ఏ-ఫాంలు పంపిన రాజకీయ పార్టీలు
- అభ్యర్థులు ఖరారు కావడంతో జోరందుకున్న ఎన్నికల ప్రచారం
- నామినేషన్ల దాఖలు తర్వాత అభ్యర్థుల ఖర్చుపై షాడో అకౌంట్
- అక్రమ నగదును అడ్డుకునేందుకు భద్రత మరింత కట్టుదిట్టం

సాక్షి ప్రతినిధి కర్నూలు: జిల్లాలో ఒక పార్లమెంట్, 8 అసెంబ్లీ స్థానాలకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. రేపు ఉదయం 10.30గంటలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అప్పటి నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయొచ్చు. ఈ నెల 25 వరకూ నామినేషన్లు దాఖలు చేస్తారు. 26వ తేది నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 29 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు సంబంధించి బీ-ఫాంలు రావాల్సి ఉంది. అయితే ఏ-ఫాంలు ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు రాజకీయపార్టీలు పంపాయి. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 14 రోజులు మాత్రమే పోలింగ్‌కు గడువుంది. దీంతో అభ్యర్థులు ఎన్నికల ప్రచారం, ఏర్పాట్లలో రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు.

ఏ-ఫాం.. బీ-ఫాం అంటే..



బీ-ఫాం అంటే గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రతిపాదిస్తూ ఇచ్చే పత్రాన్ని బీ-ఫాం అంటారు. నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థులు తమ రాజకీయ పార్టీలిచ్చిన బీ-ఫాంను దాఖలు చేయాలి. అప్పుడే ఆ అభ్యర్థికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ గుర్తులను కేటాయిస్తారు. బీ-ఫాంను పార్టీ అధ్యక్షుడు నిర్ణయించిన వ్యక్తి జారీ చేస్తారు. బీ-ఫాం జారీ చేసేందుకు సంబంధిత వ్యక్తికి పార్టీ అధ్యక్షుడు ఆమోదాన్ని తెలుపుతూ ఏ-ఫాం అందచేస్తారు. ఏ-ఫాం ఎవరి పేరుతో అధ్యక్షుడు ఇస్తారో, ఈ వ్యక్తికి పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫాం ఇచ్చే అధికారం ఉంటుంది. తన పేరుమీద అందజేసిన ఏ-ఫాంను ఆయా నియోజకవర్గాల్లోని ఎన్నికల అధికారులకు సంబంధిత వ్యక్తి అందజేయాల్సి ఉంటుంది.

ఊపందుకున్న ప్రచార పర్వం

అభ్యర్థులు ఇప్పటికే ప్రచారపర్వాన్ని వేగవంతం చేశారు. అభ్యర్థుల బంధువులు, రక్తసంబంధీకులు మొత్తం నియోజకవర్గాల్లో వాలిపోయారు. సకుటుంబసపరివారంగా వార్డులను పంచుకుని ప్రచారాన్ని సాగిస్తున్నారు. అభ్యర్థుల గుర్తు చెబుతూ ఓటర్లను ఆకర్షిస్తూ ముందుకెళ్తున్నారు. ప్రచారంలో టిఫిన్ సెంటర్లలో దోశలు వేయడం, రజకులు ఉంటే దుస్తులు ఐరన్ చేయడం, టీ దుకాణాల్లో టీ కాచడం వంటి ఫీట్లు చేస్తూ పాట్లు పడుతున్నారు. పోలింగ్ ముగిసే వరకూ ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎన్ని రకాలుగా పాట్లు పడాలో అన్నీ పడుతున్నారు.





అభ్యర్థులు చేసే ఖర్చుపై షాడో అకౌంట్

ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు రూ.40లక్షలు, ఎంపీ అభ్యర్థులు రూ.95 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి. అభ్యర్థుల ఖర్చును లెక్కించేందుకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు షాడో అకౌంట్‌ను నిర్వహిస్తారు. ఇన్‌కం ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్‌లో యూడీసీ స్థాయి అధికారులతో టీంలు ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు తర్వాత అభ్యర్థి ఖర్చు చేసే ప్రతీ రూపాయి అకౌంట్‌లోకి వస్తుంది. ఆయా ప్రాంతాల్లో జరిగే ప్రచారం మొత్తం వీడియో తీయించి టేపుల్ని పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు బృందాలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా ఖర్చును లెక్కిస్తారు. అలాగే డీపీసీ(డిస్ట్రిక్ ప్రొక్యూర్‌మెంట్ కమిటీ) చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్లు ఉంటారు. ప్రచారపర్వంలో కండువాలు, జెండాల నుంచి అన్ని ఖర్చులను లెక్కించేందుకు వీరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. వీరికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు.

నగదు తనిఖీలు మరింత కట్టుదిట్టం



నామినేషన్ల తర్వాత ఎన్నికల్లో నగదు ప్రభావం అధికంగా ఉంటుంది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు కొన్ని పార్టీలు నగదు పంపిణీ చేస్తాయి. దీంతో నిధులు సమకూర్చుకోవడం, వాటిని పల్లెలకు పంపిణీ చేస్తాయి. దీంతో నామినేషన్ తర్వాత పోలీసులు మరింత కట్టుదిట్టంగా చెక్‌పోస్టుల్లో తనిఖీలు నిర్వహిస్తారు. స్పెషల్ స్క్వాడ్‌లు కూడా అనుమానిత వ్యక్తులు, వాహనాలను ఆపి తనిఖీలు చేస్తాయి. ఇందుకోసం అన్ని మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. వాహనాలను, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయాలకు సంబంధం లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. నగదును ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారు? నగదు ఎక్కడి నుంచి అందింది? ఏ అవసరాల రీత్యా తీసుకెళ్తున్నారో ఆధారాలు చూపించాలి. ఆధారాలపై పోలీసులు సంతృప్తి చెందకపోతే నగదును సీజ్‌చేసి ఐటీ అధికారులకు స్వాధీనం చేస్తారు. తగిన ఆధారాలు చూపితేనే తిరిగి విడుదల చేస్తారు. బ్యాంకు ఖాతాల లావాదేవీలపైనా ప్రత్యేక నిఘా ఉంచారు. అధికమొత్తంలో నగదు బదిలీ జరిగితే కచ్చితంగా ఇద్దరి పాన్‌కార్డు నెంబర్లు, అకౌంట్ నంబర్, బ్రాంచ్ పేరు, ఏరియా తదితర వివరాలు బ్యాంకులో సమర్పించాలి.

స్టాటిక్ సర్వేలైన్స్ బృందాల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న నాసరరెడ్డి

- ఎంసీసీ నోడల్ ఆఫీసర్ జి.నాసరరెడ్డి

కర్నూలు (అర్బన్): సార్వత్రిక ఎన్నికల్లో స్టాటిక్ సర్వేలైన్స్ బృందాల పాత్ర చాలా కీలకమని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) నోడల్ ఆఫీసర్ జి.నాసరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ సమావేశ భవనంలో స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్‌లు తమకు నిర్దేశించిన ప్రాంతాల్లో శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని వాహనాల తనిఖీని ముమ్మరం చేయాలన్నారు. ఒక వాహనంలో రూ.50 వేలకు మించి ఉన్నట్లయితే, అందుకు తగిన ఆధారాలు చూపని పక్షంలో, అలాగే ఏవైనా రాజకీయ పార్టీకి చెందిన బ్యానర్లు, పోస్టర్లు, ఇతర ప్రచార సామాగ్రి విలువ రూ.10 వేలకు మించి ఉన్నట్లయితే ఆ వివరాలను ఎలక్షన్స్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. వివరాలను నమోదు కాగానే ఎన్నికల నిబంధనలను అమలు చేస్తున్న 13 ఏజెన్సీలకు సమాచారం వెళ్తుందన్నారు. సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి ఎస్ఎస్‌టీ బృందాలతో సమన్వయం చేసుకుని పరిమితికి మించి ఉంటే సంబంధిత పత్రాల ఆధారంగా సీజ్ చేస్తారన్నారు. సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువులను పంచనామా చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందించాల్సి ఉందన్నారు. హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి మాట్లాడుతూ.. ఎస్ఎస్‌సీ బృందాలు తనిఖీ చేసే ప్రక్రియను వీడియోగ్రఫీ చేయించాలన్నారు. బంగారు నగలు ధరించిన/రవాణాకు సంబంధించి వివాహిత అయినట్లయితే 500 గ్రాములు అవివాహిత మహిళ అయితే 250 గ్రాముల వరకు, పురుషులకు సంబంధించి 100 గ్రాముల వరకు మినహాయింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 7 కోట్లిచ్చాను.. ఇంకెక్కడి నుంచి తేవాలి?

- ఖర్చులకోసం డబ్బు తేవాలంటూ నియోజకవర్గ నేత విష్ణు వర్ధన్ రెడ్డి ఒత్తిడి
- మూడు రోజులుగా అజ్ఞాతంలోకి పోయిన కోడుమూరు టీడీపీ అభ్యర్థి దస్తగిరి

కర్నూలు: కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి మూడు రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. రోజువారీ ఖర్చులకోసం డబ్బు తీసుకురావాలంటూ నియోజకవర్గ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో దస్తగిరి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు స్థానిక నేతలు చెబుతున్నారు. అభ్యర్థిగా పేరు ప్రకటించడానికి నెలరోజుల ముందే రూ. 7 కోట్లు డిపాజిట్ చేశానని, ఇంకా డబ్బులు తేవాలని వేధిస్తే ఎక్కడి నుంచి తేవాలంటూ దస్తగిరి మనోవేదనకు గురైనట్లు సమాచారం. ఈనెల 14 నుంచి బొగ్గుల దస్తగిరి టీడీపీ కార్యకర్తలకు, నేతలకు అందుబాటులో లేకపోవడంపై చర్చ జరుగుతోంది. 15న కోడుమూరులో జరిగిన ఎన్నికల ర్యాలీకి దస్తగిరి రాకపోవడంతో కార్యకర్తలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై ఎన్నికల ఇన్‌చార్జ్ బీద రవిచంద్ర విష్ణు వర్ధన్‌రెడ్డిని ప్రశ్నించగా తమిళనాడులోని వేళంగిమాత దర్శనార్థం వెళ్లాడని చెప్పినట్లు తెలిసింది. ఈ సమాధానంతో సంతృప్తి చెందని రవిచంద్ర కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి గందరగోళంగా మారిందని, పరిస్థితిని అధిష్టానానికి వివరిస్తానని హెచ్చరించినట్లు సమాచారం. కాగా ఈనెల 15న కోడుమూరులో జరిగిన కార్యకర్తల ర్యాలీకి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వర్గానికి చెందిన నేతలను ఎందుకు పిలువలేదని విష్ణు ప్రశ్నించినట్లు సమాచారం. దస్తగిరి అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో నందమూరి బాలక్రిష్ణ పర్యటన కోడుమూరులో రద్దయింది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

- వారం రోజుల్లో లోకేషన్లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశం

కర్నూలు(సెంట్రల్): సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో సాధారణ ఎన్నికల నిర్వహణపై అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెబ్‌కాస్టింగ్‌కు వారం రోజుల్లో లోకేషన్‌ను సెక్టోరియల్ అధికారులు గుర్తించాలన్నారు. వెబ్ కాస్టింగ్ పూర్తయిన తర్వాత సంబంధిత లైవ్ ఫీడ్‌ను జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేయనున్న ఎల్ఈడీస్క్రీన్లతోపాటు సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు కూడా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు గురువారం నుంచి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అదే రోజు నుంచి పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం విద్యాశాఖ నుంచి 243 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించనున్నామని, వీరికి ఒక్కొక్కరికి నాలుగు పోలింగ్ కేంద్రాలను కేటాయించనున్నట్లు చెప్పారు. పోలింగ్ రోజున గంట గంటకు ఎంత శాతం పోలింగ్ నమోదైన వివరాలను కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు సేకరించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని, ఓటర్లకు మంచి నీటిని సౌకర్యం కల్పించాలని, బారికేడ్లను నిర్మించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎన్నికల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మే 1 వతేదీన నియోజకవర్గాల వారీగా పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్ఓ, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్ఓ,సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, కోడుమూరు ఆర్ఓ,ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి, పత్తికొండ ఆర్ఓ, ఆర్‌డీఓ రామలక్ష్మీ, ఎమ్మిగనూరు ఆర్ఓ చిరంజీవి, మంత్రాలయం ఆర్ఓ మురళీ, ఆలూరు ఆర్ఓ రాము నాయక్ డీఈఓ శామ్యూల్, డీటీసీ శ్రీధర్, సీపీఓ హిమప్రభాకరరాజు పాల్గొన్నారు.

పెరిగిన వడగాడ్పులు

- గోస్పాడులో 44.3, నందికొట్కూరులో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత



ఎండ తీవ్రతకు కర్నూలు కలెక్టరేట్ వద్ద చున్నీ కప్పుకొని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
గోస్పాడు	44.3
నందికొట్కూరు	44.2
చాగలమర్రి	43.9
బండిఆత్మకూరు	43.8
కొత్తపల్లి	43.7
మహానంది	43.6
పాణ్యం	43.5
డోన్	43.5
బనగానపల్లె	43.5
ఆత్మకూరు	43.4
గూడూరు	43.1
కర్నూలు	43.0
మంత్రాలయం	42.7
కౌతాళం	42.5
హొళగుంద	42.4

కర్నూలు(అగ్రికల్చర్): ఉష్ణోగ్రతలు రోజురోజుకు అధికమవుతున్నాయి. రాష్ట్రంలోనే ఎండల తీవ్రత ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. మధ్యాహ్నం 11 గంటలకు మొదలైన ఎండలు, వడగాడ్పుల తీవ్రత సాయంత్రం వరకు కొనసాగుతోంది. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో కూడా వడగాడ్పులు ఉండటం గమనార్హం. రానున్న రోజుల్లో ఎండలు, వడగాడ్పుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు. వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 46 నుంచి 48 డిగ్రీల వరకు నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

- కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- 8 మంది జిల్లా అధికారులకు 25 మండలాల బాధ్యతలు

కర్నూలు(అర్బన్): వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా జిల్లా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఎదురైతే వాటిని వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామాకు సంబంధించిన అధికారులతో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్‌లో డ్వామాకు సంబంధించిన ఏఓ, ఏపీడీ, విజిలెన్స్ ఆఫీసర్‌తో పాటు ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి సాంకేతిక సహాయకులు, ఐఈసీ కన్సల్టెంట్, డీఈఓ అందుబాటులో ఉంటారు. అలాగే జిల్లాలోని 25 మండలాల్లోని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ఎనిమిది మంది జిల్లా అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు మండలాలను కేటాయించారు. వీరు తమకు కేటాయించిన మండలాల్లోని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది. ఎక్కడైనా తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్లు పాడైపోయినా, నీరు కలుషితమైనా వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉంది. తాగునీటి సమస్యలతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై కూడా చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రతి రోజు తమకు కేటాయించిన మండలాల్లోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి సమస్య ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారనే నివేదికలను తమకు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేకాధికారులు వీరే...

అధికారి పేరు, హోదా	ఫోన్ నంబర్	కేటాయించిన మండలాలు
టీ నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి	9849903239	కోసిగి, కౌతాళం, మంత్రాలయం
వరలక్ష్మి, జెడీ, వ్యవసాయశాఖ	8886614216	గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు
జీ శ్రీనివాస్, జెడీ, పశు సంవర్ధశాఖ	9989997102	ఆలూరు, హాలహర్వి, హొళగుంద
ఉమాదేవి, పీడీ, ఏపీఎంఐపీ	7995087059	కల్లూరు, కోడుమూరు, కర్నూలు
సలీంభాష, పీడీ, డీఆర్‌డీఏ	9490957008	ఆదోని, గూడూరు, పెద్దకడుబూరు
జీ అమర్‌నాథ్‌రెడ్డి, పీడీ, డ్వామా	9959023450	కృష్ణగిరి, ఓర్వకల్లు, వెల్దుర్తి
సిద్ధలింగమూర్తి, పీడీ, హౌసింగ్	7093930113	చిప్పగిరి, మద్దికెర, పత్తికొండ
జీ నాగేశ్వరరావు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్	9100122400	ఆస్పరి, సీ బెళగల్, దేవనకొండ, తుగ్గలి

క్లుప్తంగా

ఆకతాయికి జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఓ ఆకతాయికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ మంగళవారం జైలు శిక్ష విధించారు. స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన షేక్‌ఫయాజ్ టూటౌన్ పరిధిలోని హోటల్ కూడలి వద్ద దారినవెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టూటౌన్‌పోలీసులు ఆకతాయిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి నాలుగు రోజులు జైలు శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాలో తాగునీటి ఇబ్బందులు లేవు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో తాగునీటి కోసం ఇబ్బందులేమి లేవని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డికి నివేదించారు. మంగళవారం విజయవాడ నుంచి సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, ఉపాధి పనులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలోని పరిస్థితులను సీఎస్‌కు వివరించారు. తాగునీటికి ఇబ్బంది ఉన్న ప్రదేశాలకు నీరు సరఫరా చేసేందుకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. ఉపాధి హామీ పనులు ఉదయం పూట చేయిస్తున్నామని, పని జరిగే చోటా కూలీలకు అవసరమైన మంచి నీరు, షెడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్‌తోపాటు ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖరరెడ్డి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు,విద్యుత్ ఎస్‌ఈ ఉమాపతి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన పద్మకళ్యాణి, బృందం వారిచే భక్తిరంజని, సంప్రదాయ నృత్యప్రదర్శన ప్రదర్శించారు. భక్తి రంజని కార్యక్రమంలో భాగంగా వాతాపి గణపతి, కైలాసగిరి నుంచి, ఆనందవర్తన, విజయాంబికే, శివుడు తాండవమాడే తదితర గీతాలను అక్షర, అభిజ్ఞ, నందిక, శృతి, కలాంజలి, విరాజిత, కేదారేశ్వరి, జీవన్ తదితరులు ఆలపించారు. గాత్ర సహకారాన్ని బీవీఎస్ ఇందు మోహన్, వయెలిన్ సహకారాన్ని బీఎస్ఆర్ చైతన్య కౌశిక్ అందించారు. సంప్రదాయ నృత్యప్రదర్శనలో మూషిక వాహన, భో శంభో, శివ తాండవం, శంభో శివ శంభో తదితర గీతాలకు శృతికల్యాణ్, నవ్య, లహరి, జానకిశృతి, చక్రిక, ఆద్య, నాగదీక్షిత, లక్షణ్య తదితరులు నృత్య ప్రదర్శన ప్రదర్శించారు. అలాగే రెండవ కార్యక్రమంలో భాగంగా విజయనగరానికి చెందిన సీహెచ్ అర్చనప్రియ, బృందం వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన ప్రదర్శించారు.

ఫలరాజం.. 'ధర' హాసం

- మామిడికి మార్కెట్‌లో మంచి ధర
- హైదరాబాద్‌లో టన్ను రూ.90 వేల నుంచి రూ.1.50 లక్షలు
- కర్నూలు మార్కెట్‌లో రూ.70 వేల నుంచి రూ.90 వేలకు విక్రయాలు
- ఉమ్మడి జిల్లాలో దాదాపు 25 వేల ఎకరాల్లో మామిడి తోటలు
- సగటున ఎకరాకు 4 నుంచి 5 టన్నుల వరకు దిగుబడులు


ఓర్వకల్లు మండలం పాలకొలనులో నాణ్యమైన కాయలతో మామిడి చెట్టు

కర్నూలు(అగ్రికల్చర్): ఫలాల్లో రారాజు వంటి మామిడికి మార్కెట్‌లో రికార్డుస్థాయిలో ధర లభిస్తోంది. కర్నూలు మార్కెట్‌లో టన్ను రూ.70 వేల నుంచి రూ.90 వేల వరకు పలుకుతోంది. హైదరాబాద్ మార్కెట్‌లో రూ.90 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ధర లభిస్తోంది. వినియోగదారులు అమితంగా ఇష్టపడే బేనీసా రకం మామిడికి మార్కెట్లో డిమాండ్ ఉంటోంది. ఈ రకం మామిడికి మంచి ధర లభిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 8000 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 16,500 ప్రకారం 24,500 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించాయి. ప్యాపిలి, డోన్, కల్లూరు, ఓర్వకల్లు, పాణ్యం, బేతంచెర్ల, బనగానపల్లె, వెల్దుర్తి, కృష్ణగిరి, పత్తికొండ, దేవనకొండ, గూడూరు, కర్నూలు తదితర మండలాల్లో తోటలు అభివృద్ధి చెందాయి. ఈ ఏడాది మొదట్లో పూత బాగా వచ్చినప్పటికీ అధిక ఉష్ణోగ్రతలతో రాలిపోయింది. ఎండల ప్రభావంతో పూత, పిందె రాలి దిగుబడులు తగ్గిపోయాయి. ప్రస్తుతం ఎకరాకు సగటున 4 నుంచి 5 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఉమ్మడి జిల్లా మొత్తమ్మీద ఈ సారి మామిడిలో 1.20 లక్షల టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్ మార్కెట్‌లో ధర బాగుండటంతో కర్నూలు, నంద్యాల జిల్లాల రైతులు అక్కడికే తరలిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన అనేక మంది రైతులు టన్ను రూ.68 వేల నుంచి రూ.లక్ష వరకు ధరతో అమ్ముకోవడం విశేషం,

పోషకాలు మెండు..
మామిడి సీజనల్‌గా పండుతుంది. వేసవిలో లభించే ఈ పండ్లు రుచికరంగా ఉండటమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. మామిడిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇందులో ఫోలెట్, బీటా కెరాటిన్, ఐరన్, విటమిన్ ఏ, సీ అలాగే కాల్షియం, జింక్,విటమిన్–ఇ వంటి పోషకాలు ఉన్నాయి. సామాన్యులు మొదలు కొని సంపన్నుల వరకు మామిడి రుచి చూస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నాణ్యత పెంచుకోవడంపై దృష్టి
మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో రైతులు మామిడి నాణ్యతను పెంచుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. గత ఏడాది వరకు ఎలాంటి కెమికల్స్ ప్రభావం లేని మామిడి యూరిపియన్ దేశాలకు ఎగుమతి అయ్యింది. జిల్లాలో అనేక మంది పూర్తి నాణ్యతా ప్రమాణాలతో మామిడిని పండిస్తున్నారు. ఇందుకు ఫ్రూట్ కవర్లు వాడుతున్నారు. నాణ్యమైన మామిడి పండ్లను రైతుల దగ్గర ముంబాయి నుంచి వచ్చిన వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని గ్రేడింగ్ చేసి విదేశాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది కూడా కర్నూలు జిల్లాలో పండించిన మామిడి విదేశాలకు ఎగుమతి అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మామడిలో మచ్చ, గార తెగులు, పండుఈగ సమస్యలు ఉన్నాయి. వీటిని సమర్థవంతంగా నివారించుకొని నాణ్యతను పెంచుకుంటే రైతుల ఇంటి సిరుల పంట పండినట్లే.

గిట్టుబాటు అవుతుంది



మాకు మామిడి తోటలు ఉండటంతో పాటు లీజుకు కూడా తీసుకుంటాం. ఈ సారి 14 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.ఈ సారి అధిక ఉష్ణోగ్రతలు మామిడిని దెబ్బ తీశాయి. ఎండల తీవ్రతతో మామిడిలో పూత, పిందె చాలా వరకు రాలిపోయింది. ధరలు ఆశాజనకంగా ఉండటం సంతృప్తి ఇస్తోంది. టన్ను ధర రూ. 70 వేల నుంచి రూ.90 వేల వరకు పలుకుతోంది. ధరలు ఇలాగే నిలకడగా ఉంటే గిట్టుబాటు అవుతుంది. మంచి ధరలు పొందేందుకు మామిడిలో నాణ్యతను పెంచుకునేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– మహబూబ్‌బాషా, మామిడి రైతు, పాలకొలను, ఓర్వకల్లు మండలం

అక్రమ మ్యూటేషన్లను రద్దు చేశాం

- లోకాయుక్తకు నివేదించిన వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్

కర్నూల(సెంట్రల్): వైఎస్ఆర్ కడప జిల్లాలోని పోరుమామిళ్ల, శ్రీ అవధూత కాశీనాయన మండలాల్లో ఆక్రమణకు గురైన భూముల మ్యూటేషన్లను రద్దు చేసినట్లు ఆ జిల్లా కలెక్టర్ లోకాయుక్తకు నివేదించారు. వైఎస్ఆర్ కడప జిల్లాలోని పోరుమామిళ్ల మండలంలోని చెన్నారెడ్డిపేట, బొప్పాపురం, అక్కలరెడ్డిపల్లె, శ్రీఅవధూత కాశీనాయన మండలంలోని రంగసముద్రం, అక్కంపేట గ్రామాల్లోని కొన్ని డీకేటీ భూములను పోరుమామిళ్ల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నాగార్జునరెడ్డి, అతని కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్నారని దళిత్ కమిటీ పేరుతో వచ్చిన ఫిర్యాదుపై లోకాయుక్త వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్‌ను విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో బద్వేలు ఆర్‌డీఓతో కలెక్టర్ పూర్తి స్థాయి విచారణ చేయించారు. అయితే, డీకేటీ భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నిబంధనలకు విరుద్ధంగా మార్చి మ్యూటేషన్ చేసినట్లు గుర్తించారు. ఆ మ్యూటేషన్లను రద్దు చేసి ప్రభుత్వ భూములను కాపాడినట్లు మంగళవారం లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డికి వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ నివేదించారు. దీంతో ఫిర్యాదుపై విచారణ ముగిసినట్లు జడ్జి ప్రకటించారు.

సెబ్ సిబ్బందిపై సారా తయారీదారుల దాడి

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్
- ఓర్వకల్లు పీఎస్, కర్నూలు సెబ్ స్టేషన్‌లో ఫిర్యాదు

కర్నూలు: నాటుసారా, అక్రమ మద్యం కట్టడికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నాటుసారా స్థావరాలపై దాడులు కొనసాగిస్తున్నారు. ఓర్వకల్లు మండలం గుడుంబాయితండాలో నాటుసారా విక్రయాలు, రవాణా జోరుగా సాగుతున్నట్లు సమాచారం అందడంతో కర్నూలు సెబ్ ఎస్‌ఐ రెహనా బేగం నేతృత్వంలో హెడ్ కానిస్టేబుళ్లు గోపాల్, వరలక్ష్మి, కానిస్టేబుళ్లు మధుసూదన్‌రెడ్డి, అయ్యన్న(ఇంటిలిజెన్స్ విభాగం)తో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్లు సోమవారం గుడుంబాయి తండా చేరుకున్నారు. శివారులోని సారా బట్టీలు ధ్వంసం చేసి అక్కడున్న డ్రమ్ములు, ఊట సు పగులగొడుతుండగా సారా తయారీదారులు తిరుగుబాటు చేసి రాళ్లదాడి చేయడంతో ఇద్దరు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సారా తయారీదారు రామాంజి నాయక్‌ను సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకోగా లక్ష్మన్న నాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు కొంత దూరం పారిపోయి తిరిగి వెనక్కు వచ్చి కానిస్టేబుళ్లపై రాళ్లతో దాడి చేసి రామాంజి నాయక్‌ను విడిపించుకుని పారిపోయారు. రాళ్ల దాడిలో కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, మరో కానిస్టేబుల్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో సెబ్ అధికారులు ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సారా తయారీదారులపై ఫిర్యాదు చేశారు. అలాగే కర్నూలు సెబ్ స్టేషన్‌లో కూడా ముగ్గురు సారా తయారీదారులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనను సెబ్ పోలీసులు గోప్యంగా ఉంచినప్పటికీ ఓర్వకల్లు పోలీసులు విచారణ జరుపుతుండటంతో చర్చనీయాంశంగా మారింది.

ఆగమ పాఠశాల వార్షిక పరీక్షలు ప్రారంభం


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వీరశైవ ఆగమ పాఠశాల విద్యార్థులకు చంద్రవతి కల్యాణ మండపంలో మంగళవారం వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. అర్చక ప్రవేశ, వర, ప్రవర కోర్సులకు సంబంధించి రెండు రోజుల పాటు ఆగమ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 115 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అర్చక ప్రవేశ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 35 మంది, అర్చక ప్రవేశ ద్వితీయ సంవత్సరానికి 37 మంది, అర్చక ప్రవర ప్రథమ సంవత్సరానికి 26 మంది, అర్చక ప్రవర ద్వితీయ సంవత్సరానికి 17 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మంగళవారం ఉదయం మొదటి పేపర్‌గా సంస్కృతం, మధ్యాహ్నం ఆహ్నిక పరీక్ష నిర్వహించారు. బుధవారం ఉదయం నిత్యారాధన, మధ్యాహ్నం మౌఖిక, ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష నిర్వహణకు సంగారెడ్డి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.మహాంతయ్య ముఖ్య పరీక్ష అధికారిగా వ్యవహరించారు. అలాగే ఆలయ విభాగపు ఏఈవో ఎం.హరిదాసు, దేవస్థాన ఆగమ పాఠశాల ప్రిన్సిపల్ ఎం.శివశంకరయ్య ముఖ్య పరీక్షాధికారిగా వ్యవహరించారు. దేవస్థాన పర్యవేక్షకులు పి.ఉమేష్, పి.దేవిక, డి.స్వర్ణలత, ఆగమ పాఠశాల అధ్యాపకులు ఎం.శివయ్య, డి.లక్ష్మీనారాయణ ఇన్విజిలేటర్‌గా వ్యవహరించారు.

రూ.8.92 లక్షల నగదు సీజ్

నంద్యాల(అర్బన్): నంద్యాల పట్టణంలో బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.8.92 లక్షల నగదును మంగళవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు బిల్లులు లేకుండా ద్విచక్రవాహనంపై డబ్బు తీసుకెళ్తుండగా జీవీ మాల్ సమీపంలో డబ్బు సీజ్ చేసి రెండవ పట్టణ పోలీసులకు అప్పగించారు. ఓ పెట్రోల్ బంక్‌కు సంబంధించిన డబ్బు అని, బిల్లులు లేకపోవడంతో సీజ్ చేశామని స్క్వాడ్ సిబ్బంది తెలిపారు.

ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు వేయవచ్చు

- సువిధ యాప్ ద్వారా అవకాశం కల్పించిన ఎన్నికల కమిషన్

నియోజకవర్గం పేరు	ఆర్‌ఓ	నామినేషన్ దాఖలు చేసే కార్యాలయం
కర్నూలు(పార్లమెంట్)	కలెక్టర్	కలెక్టర్ చాంబర్, కలెక్టరేట్(ఆర్‌ఓ-కలెక్టర్)
కర్నూలు (అసెంబ్లీ)	కేఎంసీ కమిషనర్	కర్నూలు మునిసిపల్ కమిషనర్ చాంబర్
పాణ్యం	జాయింట్ కలెక్టర్	జాయింట్‌కలెక్టర్ చాంబరు,జేసీ కార్యాలయం
పత్తికొండ	ఆర్‌డీఓ, పత్తికొండ	ఆర్‌డీఓ చాంబర్, పత్తికొండ
కోడుమూరు	ఆర్‌డీఓ, కర్నూలు	ఆర్‌డీఓ కార్యాలయం, కర్నూలు
ఎమ్మిగనూరు	ఎస్‌డీసీ, జాతీయ రహదారుల విభాగం, కర్నూలు	తహసీల్దార్ కార్యాలయం, ఎమ్మిగనూరు
మంత్రాలయం	ఎస్‌డీసీ, హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3 కర్నూలు	తహసీల్దార్ కార్యాలయం, మంత్రాలయం
ఆదోని	సబ్‌కలెక్టర్, ఆదోని	సబ్‌క లెక్టర్ కార్యాలయం, ఆదోని
ఆలూరు	ఎస్‌డీసీ హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-4, కర్నూలు	తహసీల్దార్ కార్యాలయం, ఆలూరు

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానున్నది. ఏప్రిల్ 25వ తేదీవరకు నామినేషన్ల స్వీకరణకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఎన్నికల సంఘం నామినేషన్లను ఆన్‌లైన్ ద్వారా వేసే అవకాశం కల్పించింది. సువిధ యాప్ ద్వారా నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చు. అలాగే సెక్యూరిటీ డిపాజిట్‌ను చెల్లించవచ్చు. ఈ-ఆఫిడవిట్‌ను తీసుకోవచ్చు. అయితే ఆన్‌లైన్‌లో సమర్పించిన పత్రాలన్నింటినీ ఫిజికల్‌గా ఆర్‌ఓకు సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడు నామినేషన్ ప్రక్రియ పూర్తి అయినట్లు అవుతుంది.

- ఏప్రిల్ 18వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్లను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3.05 గంటల వరకు నామినేషన్ వేయడానికి వచ్చిన వారికి స్లిప్పులు ఇచ్చి అవకాశం కల్పిస్తారు.
- గుర్తింపు పొందిన పార్టీల నుంచి అభ్యర్థి అయినా, లేకుంటే అతని తరపున అదే నియోజకవర్గానికి చెందిన ఒక ప్రపోజర్ నామినేషన్ వేయవచ్చు. రిజిష్టర్ పార్టీ లేదా స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లకు 10 మంది బలపరచే వారు ఉండాలి.
- నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థుల వాహనాలను ఆర్‌ఓ కార్యాలయాలకు 200 మీటర్లలో నిలుపుదల చేస్తారు. అక్కడి నుంచి మూడు వాహనాలను మాత్రం 100 మీటర్ల దూరం వరకు అనుమతి ఇస్తారు. నామినేషన్ వేసే అభ్యర్థిపాటు నలుగురు వ్యక్తులను మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వెళ్లడానికి అనుమతి ఇస్తారు.
- లోక్‌సభ ఎన్నికలకు అయితే రూ. 25 వేలు, అసెంబ్లీ ఎన్నికలకు అయితే రూ.10 వేలను సెక్యూరిటీ డిపాజిట్ కింద చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలు లోక్‌సభకు అయితే రూ. 12,500, అసెంబ్లీకి అయితే రూ. 5 వేలు చెల్లించాలి. సెక్యూరిటీ డిపాజిట్‌ను నగదు రూపంలోనైనా, ట్రెజరీ రిసిప్ట్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.
- పోటీలో ఉండే అభ్యర్థులు కచ్చితంగా ఎన్నికల సంఘానికి ఆఫిడవిట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. అయితే సమర్పించే ఆఫిడవిట్‌ను అర్థమయ్యే రీతిలో తయారు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు అఫిడవిట్‌లో తప్పులు పొందు పరిస్తే రిటర్నింగ్ అధికారులది బాధ్యత కాదు.
- అభ్యర్థులు నామినేషన్ ఫైల్ చేసిన సమయంలో డాక్యుమెంట్లు జతపరచనట్లయితే నామినేషన్ల చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల్లోపు సమర్పించాల్సి ఉంటుంది. లేదంటే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది.
- అభ్యర్థులు పదేళ్లలో ఏదైనా ప్రభుత్వం ఉద్యోగం చేసినట్లయితే ప్రభుత్వానికి ఎలాంటి బకాయిలు లేవని నోడ్యూస్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. అంతేగాక అభ్యర్థులు ఫారం-ఏ, ఫారం-బీ ఒరిజినల్ కాపీలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.
- రాజకీయ పార్టీలకు ఒకరికి ఇచ్చిన బీఫామ్‌ను వెనక్కి తీసుకొని మరొక్కరికి ఇచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో ఇచ్చిన వ్యక్తికి విత్‌డ్రా చేస్తున్నామనే ఆర్డర్‌ను రాజకీయ పార్టీలు ఆర్‌ఓలకు తెలపాల్సి ఉంటుంది.

ఏ నియోజకవర్గంలో ఎక్కడ నామినేషన్లను దాఖలు చేయాలంటే...
నామినేషన్లను నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఏ నియోజకవర్గ ఆర్‌ఓ కార్యాలయంలో ఆ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించాల్సి ఉంటుంది. గతంలో కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి గూడూరులో నామినేషన్లను సమర్పించేవారు. ఈసారి ఆ నియోజకవర్గానికి కర్నూలు ఆర్‌డీఓ ఆర్‌ఓగా ఉండడంతో అతని కార్యాలయంలోనే నామినేషన్లను వేసేలా చర్యలు తీసుకున్నారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి


ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పగిడ్యాల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేస్ డైరీ, విలేజ్ రోస్టర్, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున శాంతిభద్రతలపై దృష్టి సారించాలన్నారు. సమన్లు, నాన్‌బెయిలబుల్ వారెంట్లు, పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యత పెంచుకోవాలన్నారు. విచారణ పూర్తి చేసి నిర్దేశిత కాల వ్యవధిలో చార్జ్‌షీట్ ఫైల్ చేసి సమర్థవంతమైన ట్రయిల్ ద్వారా నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయాలన్నారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవలు, నాటుసారా విక్రయించే అనుమానిత వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేయా లని ఆదేశించారు. ఎక్కువగా విజిబుల్ పోలిసింగ్ చేసి నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఎలాంటి గొడవలు, అల్లర్లు జరుగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం కొత్త ముచ్చుమర్రి నుంచి పాత ముచ్చుమర్రి వరకు ప్రత్యేక బలగాలు, కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి కవాతు నిర్వహించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్‌భాస్కర్, ప్రకాష్‌కుమార్, ఎస్ఐలు జయశేఖర్, నాగార్జున, జగన్‌మోహన్ తదితరులు ఉన్నారు.

లాహిరి..లాహిరిలో!



- కృష్ణమ్మ ఒడిలో బోటు ప్రయాణం ఆహ్లాదకరం
- రోప్‌వే ద్వారా పాతాళగంగకు మల్లన్న భక్తులు
- పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తున్న ఏపీ టూరిజం శాఖ


కృష్ణానదిలో పర్యాటకుల బోటు షికార్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనంతో పాటు నల్లమల అందాలు, కృష్ణమ్మ సోయగాలు తనివితీరా ఆస్వాదించేందుకు భక్తులు తరలివస్తున్నారు. వేసవికాలం కావడం, పిల్లలకు పరీక్షలు పూర్తవడంతో చాలా మంది శ్రీశైల యాత్ర చేస్తున్నారు. శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనంతో పాటు ఆలయ పరిసరాల్లోని సాక్షిగణపతి, హఠకేశ్వరం, పాలధార-పంచధార, శిఖరేశ్వరం, శ్రీశైల డ్యాం అందాలను ఆస్వాదిస్తున్నారు. అలాగే శ్రీశైలం పాతాళగంగలో బోటింగ్ చేస్తున్నారు.

రోప్‌వే సదుపాయం
పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఇందు కోసం శ్రీశైల యాత్రకు విచ్చేసిన భక్తులు పాతాళగంగ పుణ్యస్నానాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంతో పాతాళగంగకు రోప్ వే ఏర్పాటు చేశారు. రోప్ వే ద్వారా భక్తులు సులభతరంగా పాతాళగంగకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. రోప్‌వేలో పాతాళగంగకు చేరుకునేందుకు పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.60 చెల్లించాల్సి ఉంటుంది.

కృష్ణానదిలో బోటు షికార్
భక్తుల సౌకర్యార్థం ఏపీ టూరిజం శాఖ బోటు షికార్‌ను ఏర్పాటు చేసింది. కృష్ణానదిలో బోటులో ప్రయాణించి నల్లమల అందాలు, కృష్ణానది సోయగాలను ఆస్వాదించేందుకు ఏర్పాట్లు చేసింది. ఏపీ టూరిజం శాఖ తరపున భక్తుల భద్రతే ముఖ్యంగా బోటులో భద్రతా చర్యలు పాటిస్తూ బోటు షికార్ నిర్వహిస్తున్నారు. ఈ బోటు షికార్ శ్రీశైలం పాతాళగంగ నుంచి డ్యాం వద్దకు వెళ్లి తిరిగి పాతాళగంగ వద్దకు చేరుకుంటుంది. ఇందుకోసం పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.60 ధర చెల్లించాల్సి ఉంటుంది. కృష్ణానది సోయగాలను ఆస్వాదిస్తూ ఏర్పాటు చేసిన జాయ్ ట్రిప్ పర్యాటకులను ఎంతగానో ఉత్తేజపరుస్తుంది. శ్రీశైలం యాత్ర మరింత ఉత్సాహాన్ని నింపుతుంది.


రోప్‌వేలో పాతాళగంగకు చేరుకుంటున్న భక్తులు